
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025



రేపు వీరవాసరంలో జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్

వీరవాసరం(భీమవరం టౌన్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 4న జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు డీఈవో నారాయణ తెలిపారు. గురువారం ఇక్కడ జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలస్థాయి విజేతలంతా ఈ సైన్సు ఫెయిర్‌లో పాల్గొనాలని సూచించారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, శ్యామ్‌ప్రసాద్, ఎంఈవోలు పాల్గొన్నారు.

రైతులకు శుభవార్త

ఒక్కొక్కరికి ఏటా రూ.20 వేల లబ్ధి

- పీఎం కిసాన్ రూ.10 వేలు.. అన్నదాత సుఖీభవ రూ.10 వేల సాయం
- జిల్లాలో లక్షా 25 వేల మంది రైతులకు రూ.250 కోట్లు లబ్ధి



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రైతులకు శుభవార్త. పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మొత్తాన్ని పది వేలకు పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ కింద ఇచ్చే మొత్తాన్ని పది వేలు చేయడంతో ఒక్కో రైతులకు రూ.20 వేలు లబ్ధి చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వం రైతులకు నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్రం కూడా తన వంతుగా రైతు ఖాతాలో సొమ్ములను జమ చేయనుంది. రాజధాని అమరావతిలో గురువారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో రైతు భరోసా అంశంపై జరిగిన చర్చలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల జిల్లాలోని లక్షా 25 వేల మంది వరి, ఉద్యాన, ఆక్వా రైతులు లబ్ధి పొందనున్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద రూ.13,500 ఇచ్చేవారు. అందులో కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇచ్చింది. మిగిలిన రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం భరించేది. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ. 20వేలు ఆర్థిక సాయం అందించనున్నాయి. తద్వారా జిల్లాలో రైతులకు రూ.250 కోట్లు మేర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. వృద్ధులకు పింఛన్ మూడు వేల నుంచి నాలుగు వేలకు పెంచింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లలో భాగంగా తొలి లబ్ధిని చేకూర్చింది. పేదవాడి కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించింది. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే జూన్‌లో తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని భావిస్తోంది.

మైనార్టీ నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ.. దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మైనార్టీ నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణను ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఆర్థిక సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ఎస్ఎస్ కృపావరం తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బుద్ధ, పార్సీ, జైన్‌లకు సంబంధించిన నిరుద్యోగులు తమ బయోడేటాను ఏలూరులోని ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 08812 - 242463 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.



నూతన పోలీసు వాహనాన్ని అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, చిత్రంలో కలెక్టర్ నాగరాణి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తదితరులు

నేరాల నియంత్రణకు 800 సీసీ కెమెరాలు

డిప్యూటీ స్పీకర్ రఘురామ.. ఆకివీడు సీఐ కార్యాలయం ప్రారంభం

ఆకివీడు రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో నేరాల నియంత్రణకు 800 సీసీ కెమేరాలను ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించారు. ఆకివీడు మండలం అజ్జమూరు గరువులో సీఐ కార్యాలయాన్ని కలెక్టర్ నాగరాణి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ప్రారంభించారు. ఎంపీ బీద మస్తాన్‌రావు సహకారంతో కోటి రూపాయల విలువైన వాహనాలను ఆకివీడు, ఉండి, కాళ్ళ, పాలకోడేరు పోలీస్ స్టేషన్‌లకు సమకూర్చామన్నారు. 6న పెద అమిరంలో పారిశ్రామికవేత్త రతన్‌టాటా కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారని తెలిపారు. తర్వాత ఉండి జడ్పీ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తారన్నారు. ఆకివీడు సీహెచ్‌సీలో 7న నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని తెలిపారు. యండగండి హత్య కేసును ఛేదించిన పోలీసులను సన్మానించారు. ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ జైసూర్య, సీఐ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరుపై ఆక్రమణలు తొలగించండి

కైకలూరు : కొల్లేరు వరద ముంపును తొలగించేందుకు ఉప్పుటేరుపై ఉన్న ఆక్రమణలను తొలగించి వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. కైకలూరులో గురువారం ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగిన సమీక్షలో రఘురామ మాట్లాడుతూ ఉప్పుటేరు వెంబడి ఉన్న ఆక్రమణలతోనే ముంపు పొంచి ఉంది. ఆక్రమణలను తొలగించడమే శాశ్వత పరిష్కారం. ఆ దిశగా చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

భీమవరం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి):సీపీఎం 26వ జిల్లా మహాసభలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు అమరజీవి ఆర్‌ఎస్ నగర్‌లో వలవల శ్రీరామమూర్తి ప్రాంగణంలో (భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్)లో జరగనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. మహాసభల సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలిరోజు పట్టణంలో భారీ ప్రజా ప్రదర్శనతో ర్యాలీగా పాత బస్టాండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు. సభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం హాజరవుతారన్నారు.

పానీ పాట్లు

- గ్రామాల్లో తాగునీటి వెతలు
- రక్షిత నీటి పథకాలపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం
- శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌లు
- మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్‌లు
- కలుషితమైన తాగునీటి కాల్వలు, చెరువులు

పల్లెలు స్వచ్ఛమైన తాగు నీటికి ఘోషిస్తున్నాయి. చాలాచోట్ల వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల తరబడి ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు లేక చెరువు నీరే నేరుగా సరఫరా చేస్తున్నారు. ఇక కాల్వలు సంగతి చెప్పనక్కర్లేదు. అవి చెత్తా చెదారాలతో కంపు కొడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో స్వచ్ఛతకు చోటెక్కడ..? గ్రామాల్లో తాగునీటిపై పరిశీలన.. 6లో..

ఆంధ్రజ్యోతి పరిశీలన







పెరుగుతున్న నేరాల కూత

భీమవరం జీఆర్పీ రైల్వే స్టేషన్‌ను వేధిస్తున్న సిబ్బంది కొరత

భీమవరం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ ఒకటో నంబర్‌పై వున్న గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ (జీఆర్పీ)లో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. స్టేషన్ పరిధి నరసాపురం-నిడదవోలు-కైకలూరు వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, రైల్వే ప్లాట్ ఫారమ్స్, రైళ్లు, ట్రాక్‌లపై ఎలాంటి ప్రమాదాలు, ఆత్మహత్యలు, దొంగతనాలు జరిగినా ఇక్కడి నుంచి రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించి కేసులు నమోదు చేయాలి. ఆత్మహత్యలు, ప్రమాదాల్లో చనివారి మృతదేహాలను సంబంధిత ప్రభుత్వాసుపత్రుల్లో పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించాలి. ఆచూకీ లేని మృతదేహాలైతే వాటిని కొన్ని రోజులపాటు మార్చురీలో ఉంచి అప్పటికీ ఆచూకీ లేకపోతే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేయాల్సిన బాధ్యత రైల్వే పోలీసులదే. దొంగతనాలు జరిగితే కేసులు నమోదు చేసి నేరస్తుల కోసం గాలించి చివరకు వారు దొరికితే పోయిన సొత్తును రికవరీ చేసి వారిని విజయవాడ రైల్వే కోర్టుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత వారిపైనే ఉంది. ఇలాంటి పెద్ద రైల్వే పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరత ప్రస్తుతం ఉన్న సిబ్బందిని వేధిస్తోంది.

అరకొర సిబ్బందితో అవస్థలు

భీమవరం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో 19 మంది పోలీసు కానిస్టేబుళ్లు అవసరం. కాని ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకుగాను, ఇద్దరు మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ఒక ఎస్ఐ విధులు నిర్వహిస్తున్నారు. గతం నుంచి భీమవరం జీఆర్పీ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందని ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో రెండు, మూడు ప్లాట్‌ఫారమ్‌లకు చేర్చి రైల్వే పోలీస్ స్టేషన్ ఉండేది. అది శిథిలావస్థకు చేరి వర్షం వచ్చినప్పుడల్లా రికార్డులు తడిచిపోయేవి. చివరకు స్టేషన్ పడిపోయే పరిస్థితుల్లో కొత్త స్టేషన్ నిర్మించారు. అయినప్పటికి సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. వారిపై పనిభారం పెరిగింది.

నరసాపురం-నిడదవోలు-కైకలూరు వరకు పరిధి..

పదుల సంఖ్యలో కేసులు.. పరిష్కారమయ్యేవి కొన్నే

సిబ్బంది తక్కువ.. నేరాలు ఎక్కువ

ఈ స్టేషన్ పరిధిలో నెలకు పది వరకు ఆత్మహత్యలు, ప్రమాదాలు జరుగుతుంటాయి. దొంగతనాలు, సెల్‌ఫోన్ చోరీలు ఎక్కువే. గత ఏడాది 20 దొంగతనాలు జరగ్గా ఐదుగురిని మాత్రమే అరెస్ట్ చేసి, రికవరీలు చేశారు. 60 సెల్‌ఫోన్‌లు చోరీలకు గురి కాగా 30 రికవరీ చేసి పోగొట్టుకున్న వారికి అప్పగించారు. భీమవరానికి చెందిన ఒక వ్యక్తి సూట్ కేసులో రూ.18 లక్షల బంగారు వస్తువులు మాయం కాగా ఆ నిందితులు ఇప్పటికి దొరకలేదు. దీనికి సిబ్బంది కొరతే కారణం. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి.

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

భీమవరం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు కానుంది. తొలుత ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉండగా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా ఏడు రోజులపాటు అన్ని అధికారిక కార్యక్రమాలు వాయిదా వేసిన విషయం విదితమే. సంతాపదినాలు ఈ నెల ఒకటో తేదీతో ముగిసిన నేపథ్యంలో భోజన పథకాన్ని 3వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ పథకాన్ని అధికారికంగా విద్యా శాఖ మంత్రి లోకేశ్ శనివారం మచిలీపట్నంలో ప్రారంభించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా అదే రోజు నుంచి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేసేందుకు వీలుగా వాయిదా వేసినట్టు విద్యా శాఖ వర్గాలు వివరించాయి. హైస్కూల్ విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూనే ఇంటర్ విద్యార్థులకు వర్తింపజేస్తారు. జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,464 మంది విద్యార్థులకు, 25 ప్లస్-1 జూనియర్ కళాశాలల్లో 470 మందికి లబ్ధి చేకూరనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించారు. ఇప్పుడు మధ్యాహ్న భోజనం అమలులోకి వస్తుంది. వీరికి ఆహార పదార్థాలను తయారు చేసేందుకు వంట కార్మికులకు ఇచ్చే బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలను సంబంధిత హైస్కూళ్లకు చేరవేశారు. భోజనం ప్లేట్లు, గ్లాసులను కళాశాలల ప్రిన్సిపాళ్లు సమకూర్చాల్సి ఉంటుంది.

ఆకివీడు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్

ఆత్మహత్యాయత్నం


- తనకు అసిస్టెంట్‌ను ఇవ్వాలని నగర పంచాయతీ కమిషనర్‌తో వాగ్వాదం
- కార్యాలయం బయటకు వచ్చి.. ఒంటిపై పెట్రోలు పోసుకున్న రాధాకృష్ణ
- సిబ్బంది అప్రమత్తం.. తప్పిన ముప్పు
- పోలీసుల దృష్టికి కమిషనర్, టీపీవో వ్యవహారం.. స్థానికంగా కలకలం

ఆకివీడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన పట్టణ ప్రణాళిక అధికారి(టీపీ వో) పి.రాధాకృష్ణ తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. అప్రమత్తమైన సిబ్బంది.. ఆయనను అడ్డుకోవడంతో పెను ముప్పు తప్పింది. వివరాల్లోకి వెళితే.. కొంత కాలంగా రాధాకృష్ణ పనిఒత్తిడితో సతమతం అవుతున్నారు. ప్లాన్‌లు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆకివీడులో నాన్ లే అవుట్‌లు వెలుస్తున్నాయంటూ విమర్శలు న్నాయి. దీనిపై కౌన్సిలర్లు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత కౌన్సిల్ సమావేశంలోనూ నాన్ లే అవుట్‌లపై కౌన్సిలర్లు ప్రస్తావించారు. వీటివల్ల మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుందంటూ నిలదీశారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతు న్నారంటూ ప్రశ్నించారు. దీనిపై టీపీవో స్పందిస్తూ 'సిబ్బంది కొరత ఉంది. సహాయకునిగా ఒక్క ఉద్యోగి లేరు. నాన్ లే అవుట్ లు ఉన్నమాట వాస్తవమే. వాటికి అనుమతులు తీసుకుంటే పట్ట ణానికి ఆదాయం వస్తుంది. లే అవుట్‌ల విషయంలోనూ తక్షణ మే చర్యలు తీసుకోలేకపోతున్నాం. సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నాం' అంటూ సమాధానమిచ్చారు. అప్పటి నుంచి సిబ్బంది కోసం ప్రయత్నించాలని నగర పంచాయతీ కమిషనర్‌కు కోరుతూ వస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం సాయంత్రం మరోమారు కమిషనర్ కృష్ణమోహన్ వద్దకు వెళ్లారు. ఆ సమ యంలో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. తనకు అసి స్టెంట్‌ను ఇవ్వాలని

(మిగతా 8వ పేజీలో)







చిలుక.. అలుక..

అలకలు..కోపాలు మనుషులకే కాదు.. పశుపక్ష్యాదులకు కూడా ఉంటాయేమో..! ఆకివీడు -ఉండి మార్గంలో రామచిలుకల జంట హావభావాలు చూస్తే అలానే అనిపించింది.. ఈ చిత్రాలకు సరదా సంభాషణలు...



ప్చ్.. నేను అలిగాను..! | నీకు కోరే ఏముంది.. ఎప్పుడూ ఉండేదేగా.. | ఇప్పుడు నేను ఏమన్నాను.. అలా మూతి ముడిచావ్ ! | సరే.. సర్లే.. ఇంకెప్పుడూ ఏమీ అనను... | సాయంత్రం షికారు కెళదామా..! | లవ్ యూ రా.. సారీ రా..

ఆంధ్రజ్యోతి పరిశీలన

పానీ పాట్లు

గ్రామాల్లో తాగునీటి పథకాలు వెక్కిరిస్తున్నాయి.. గత వైసీపీ ప్రభుత్వం తాగునీటి సరఫరా వ్యవస్థను నిర్లక్ష్యం చేయడంతో ప్రజలకు రక్షితనీరు కరువైంది... చాలాచోట్ల వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి.. ఏళ్ల తరబడి ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు లేక చెరువునీరే నేరుగా సరఫరా చేసే పరిస్థితులు నెలకొన్నాయి.. చెరువులకు తాగునీటిని సరఫరా చేసే కాల్వలు చెత్తా చెదారాలతో కలుషితమైపోయాయి.. దీంతో ఆ.. నీరే దిక్కవుతోంది. వచ్చేది వేసవికాలం.. గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది..పలు గ్రామాల్లో తాగునీటి పథకాల పనితీరును ఆంధ్రజ్యోతి పరిశీలించింది...

- గ్రామాల్లో తాగునీటి వెతలు
- రక్షిత నీటి పథకాలపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం
- శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌లు
- మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్‌లు
- కలుషితమైన తాగునీటి కాల్వలు, చెరువులు





కైకలూరు మండలం ఆటపాకలో మంచినీటి చెరువు... కలిదిండి మండలం మూలలంకలో ఫిల్టర్‌బెడ్స్‌లో మొక్కలు

మొరాయించిన తాగునీటి పథకాలు

ఐదేళ్లుగా మరమ్మతులు లేవు
పలు గ్రామాల్లో పనిచేయని ఫిల్టర్‌బెడ్స్

కైకలూరు : గ్రామాల్లో ప్రజలకు తాగేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడుతున్నారు. గత ప్రభుత్వం గ్రామాలకు నిధులు కేటాయించక పోవడంతో రక్షిత మంచినీటి పథకాలను గాలికొదిలేశారు. చాలా గ్రామాల్లో చెరువుల్లో నీరు నేరుగా పైపులైన్ల ద్వారా ఇళ్లకు అందిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పథకాల సామర్థ్యం పెరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్లు పనిచేయకపోవడంతో వాటర్ ట్యాంకుల్లో గడ్డి, కిక్కిస, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కైకలూరు నియోజకవర్గంలో 110 గ్రామాలు ఉండగా సగం గ్రామాల్లో పథకాలు పనిచేయని పరిస్థితి. దీంతో ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. కలిదిండి మండలం మూలలకం, భాస్కరరావుపేట గ్రామాలకు ఒకటే రక్షితమంచినీటి పథకం నుంచి నీరు సరఫరా అవుతుంది. ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడం, చెరువుల సామర్థ్యం మేరకు నీరు లేకపోవడంతో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. శీతాకాలంలోనే ఇలా ఉంటే రానున్న వేసవిలో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కైకలూరు మండలంలో మేజర్ పంచాయతీ అయిన ఆటపాక గ్రామంలో సుమారు 8 వేల మంది జనాభా ఉన్నారు. ఏడు ఎకరాల మంచినీటి చెరువు ఉండడంతో మార్చి నెల నుంచి రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తుంటారు. ఫిల్టర్‌బెడ్స్ సంవత్సర కాలంగా పనిచేయక పోవడంతో నేరుగా చెరువులోని నీటినే సరఫరా చేస్తున్నారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో 4 వేల మంది జనాభా ఉన్నారు. నాంది ఫౌండేషన్ ద్వారా ఆర్వో సిస్టమ్‌ను ప్రారంభించి పంచా యతీకి అప్పగించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఐదేళ్ళుగా మరుగున పడింది. మండవల్లి మండలం పెనుమాకలంకలో రక్షితమంచినీటి పథకానికి చెందిన ఓవర్ హెడ్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దీంతో నీటిని నింపేందుకు పంచాయతీ అధికారులు భయపడుతున్నారు. ఇటీవల ఓవర్‌హెడ్ ట్యాంక్ నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక నిపుణుల బృందం వచ్చి తనిఖీలు చేసింది. అయితే ఆ నివేదిక రాక పోవడంతో ప్రస్తుతం గ్రామంలోని ప్రజలు నీటి ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. చాలా గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడంతో చెరువుల నుంచి నేరుగా గృహాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభు త్వమైనా మంచినీటి చెరువుల దుస్థితిని గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుకుంటున్నారు.



ద్వారకాతిరుమల శివాలయం వీధిలో కొత్తగా నిర్మిస్తున్న మంచినీటిబోరు.. ఓ ఇంట్లో కుళాయి ద్వారా వస్తున్న బురదనీరు

ద్వారకాతిరుమలలో స్వచ్ఛనీరు కరువు

వాల్వ్ వేయించండి ప్రభూ..



యాదవ కాలనీలో మంచినీరు సక్రమంగా అందడం లేదు. పాత కాలనీకి సరిపడా నీరు అందిన తర్వాత వాల్వ్ కట్టక పోవడమే ఇందుకు కారణం. వాల్వ్ పాడై నెలలు గడుస్తున్నా పంచాయితీ వేయించడం లేదు. కొత్త వాల్వ్ వేస్తే నీరు మాకు తగినంతగా వస్తుంది. వాల్వ్ పోయిందని చెప్పినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

పెద్దిరెడ్డి త్రిమూర్తులు,యాదవ్ కాలనీ, ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల : మేజర్ పంచాయతీ ద్వారకాతిరుమలలో ప్రజ లకు చాలా ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు అందడం లేదు.ఈ పంచాయ తీలో ఐదు వేలకు పైగా జనాభా ఉండగా ఉన్న నాలుగు ట్యాంక్ లలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. కొండపైన ఉన్న పెద్ద ట్యాంకు రెండు లక్షల లీటర్ల కెపాసిటీ కాగా సంతమార్కెట్ వద్ద ఉన్నది 60 వేలు సామ్యం కలిగి బాగానే పనిచేస్తున్నాయి. దేవస్థానం నిర్మించిన వసంతనగర్ కాలనీలో ఉన్న 60 వేల కెపాసిటీ ట్యాంకు ఎగువన ఉండటం వల్ల నీరు ఎక్కడం లేదని నిలిపివేశారు.

అలాగే ఎస్సీ కాలనీలో ఉన్నమరో ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. వారు డైరెక్ట్ పంపింగ్ విధానంతో మంచినీరును వినియోగించుకుంటున్నారు. అలాగే గ్రామ అవసరాలకు 9 బోర్లు ఉన్నాయి. ఇందులో చాలా ప్రాంతాలకు మంచినీరు వెళ్లే ఓ బోరు మరమ్మతులకు గురి కాగా దీనికి మారుగా మరో బోరును నూతనంగా నిర్మిస్తున్నారు. మరమ్మ తులకు గురైన బోరునుంచి వచ్చేనీరు సురక్షితంగా ఉండటం లేదు, బురదతో నలకలు వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. కొత్తబోరు అందుబాటులోకి వచ్చేవరకూ ఈ పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆచంటలో రెండు వాటర్ ట్యాంక్‌లు అవసరం



ఆచంట: గతంలోనే ఆచంటతో పాటు పలు గ్రామాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ఏర్పాటు చేసి గత కొన్ని సంవత్సరాలుగా కుళాయిలు ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పథకంకు సంబంధించి గ్రామంలో బాలంవారిపాలెం , వెన్నరపువారిపాలెం, రావిగుంట పాలాలకు నీరు సరఫరా అవడం లేదు. ఆచంటలో ప్రస్తుతం 9 వాటర్ ట్యాంక్‌లు ఉండగా ఆచంట పెదపేట, చినపేటకు సంబంధించి మరో రెండు వాటర్ ట్యాంక్‌లు కావాల్సి ఉంది. గ్రామంలో సుమారు 20 వేల మంది జనాభా ఉన్నారు. ఇటీవల కొత్తగా కట్టుకున్న ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గ్రామంలో సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం. ఈ నీరు తాగితే ప్రజలకు కాళ్ళు లాగడం, మోకాళ్ళ నొప్పులు వంటి సమస్యలు రావని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ (ఇన్‌చార్జి) సాయిప్రకాష్ తెలిపారు.

• ఆర్వో వాటర్‌కు అలవాటుపడ్డారు



అధికారులు కుళాయిలు ద్వారా సరఫరా చేసేనీటిని ప్రజలు వాడకానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. ఎక్కువ మంది ఆర్‌వో ప్లాంట్ నీటికి అలవాటుపడ్డారు. గ్రామంలో అనేక చోట్ల ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌లు ఉండటంతో అందరూ కూడా ఈ నీటినే కొంటున్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

షేక్ ఇస్మాయేల్ జాని, ఆచంట



పిప్పర పంట కాల్వ వద్ద నిరుపయోగంగా పంపింగ్‌హౌస్.. మోటార్లు

కోట్ల రూపాయల పథకాలు నిరుపయోగం

గణపవరం : గణపవరం మండలంలోని పిప్పర దిగువ గ్రామాలకు, ఎగువ గ్రామాలకు వెరసి 25 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు లేక అలమటిస్తున్నారు. పిప్పరలోని ఉండి పంటకాల్వ గట్టుపై 3.5 కోట్ల రూపాయలతో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షితనీటి పథకాన్ని 11 గ్రామాలకు అందించేలా నిర్మాణం చేపట్టారు. 3.5కోట్లతో 10 లక్షల లీటర్లు రోజుకు సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకును ఏ.గోపవరం గ్రామం వద్ద నిర్మించారు. పంపుహౌస్‌లు కూడా నిర్మించారు. 2017లో ఈ తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. ఉండి పంట కాల్వపై పంపింగ్‌హౌస్ మోటర్లు మరమ్మ తుల కారణంగా నిలిచిపోయాయి. పైపులైన్లు కూడా దెబ్బతిన్నాయి. ఇంతవరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో స్వచ్ఛమైన తాగునీరందక ప్రజలు అనారోగ్యాల భారినపడుతున్నారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన ఈ మంచినీటి పథకం నిరుపయోగంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పైపులైన్‌లు, మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి చెరువుల్ని నింపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ తెలిపారు.

• పిప్పర పంప్‌హౌస్ పునరుద్ధరించాలి



తాగునీటి సరఫరా పథకం మూలనపడటంతో స్వచ్ఛమైన తాగునీరు లభించడం లేదు. చెరువులకు వచ్చేనీటిలో వ్యర్థాలు కొట్టుకురావడంతో ఇబ్బందులు పడ్డాం. పిప్పర వద్ద నిర్మించిన తాగునీటి పథకం ద్వారా తమ గ్రామాల ద్వారా కొంత కాలం మంచినీరు లభించింది. ఈ పథకం నిలిచిపోవడంతో స్వచ్ఛమైన తాగునీటి కొరత ఎదుర్కొంటున్నాం. ఆ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలి.

-కానుమిల్లి చంటి, మొయ్యేరు

వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు..

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కాకర్లమూడి, రావులపర్రు, కాగుపాడు, ఉప్పాకపాడులలో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలు వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. తల్లాపురంలో ఫిల్టర్‌బెడ్‌లను ఉపయోగించడం లేదని తెలిసింది. నాచుగుంటలో వాటర్ పైపులు పగిలిపోవడం వల్ల తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోంది. నారాయణపురం, ఉంగుటూర్లలో నిర్వహణ లోపం వల్ల తరచూ సరఫరాలో ఆటంకం కలుగుతోంది.

పాములపర్రులో కటకట..

పంటకాల్వ నీరు కాలుష్యం



ఉండి : ఉండి మండలం పాములపర్రులో మంచినీటి చెరువు అభివృద్ధి చేసి 20 సంవత్సరాలకు పైబడి అయ్యింది. చెరువు చాలా వరకు పూడికపోయింది. చెరువులోని నీరు పసర్లుపట్టి తాగు నీటికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఉండి పంటకాల్వ నుంచి పాములపర్రు చెరువులోకి చేరాలి. అయితే ఉండిలో పంటకాలువ ప్రధాన రహదారి వెంబడి వుండడంతో పంటకాల్వలోకి చెత్తచేరి నీరు కాలుష్యమవుతోంది. పంటకాల్వ చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా దాంతో గత నవంబరులో ఉండి నుంచి పాములపర్రు వెళ్లే పంటకాలువను శుభ్రం చేశారు. దాంతో సమస్య కొంత పరిష్కార మైంది.

• స్వచ్ఛమైన నీరు అందించడానికి చర్యలు



సొంతనిధులను వెచ్చించి ఉండి నుంచి పాములపర్రు చేరే పంట కాల్వలో చేరే చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్నాం. సంక్రాంతి పండుగ వెళ్లిన తరువాత చెవురులో పూడికపనులు, చెత్త తొలగింపు పనులు చేపడతాం. జలజీవన్‌మిషన్ ద్వారా 49.60 లక్షలు మంజూరైంది. పంచాయితీ పరిధిలోని వెంకట్రాజుపు రానికి కూడా రూ.8.30 లక్షలు మంజూరైంది. ప్రస్తుతం చెరువులోకి కొత్తనీరును లిఫ్ట్ చేయిస్తున్నాం. పనులు పూర్తియితే ప్రజలకు మంచినీటికి ఇబ్బందులు వుండవు.

కేసన శాంతకుమారి, సర్పంచ్, పాములపర్రు



కొవ్వలి గ్రామంలోని పైలట్ తాగునీటి ప్రాజెక్టు

ఫిల్టర్ బెడ్‌లకు మోక్షం ఎప్పుడు ?

పది గ్రామాల్లో శిథిలమైన వాటర్ ట్యాంకులు

దెందులూరు : గత వైసీపీ ప్రభుత్వం తాగునీటి వ్యవస్థను తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. దీంతో చాలా గ్రామాల్లో కలుషిత నీరే సరఫర అవుతోంది. దెందులూరు మండలంలోని 10 గ్రామాల్లో సురక్షిత నీరు అందే పరిస్థితి లేదు. మేజర్ గ్రామమైన కొవ్వలిలో ఉన్న పైలట్ ప్రాజెక్టు గత ఐదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. గత టీడీపీ ప్రభుత్వంలో దెందులూరు, అలుగులగూడెం, ఉప్పుగూడెం, సానిగూడెం, సత్యనారాయణ పురం, కొమ్మిరేపల్లి, సీతంపేట, పోతునూరు, ఉండ్రాజవరం, కొవ్వలి, దోసపాడు గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందేది. తాగునీరును శుద్ధిచేసే మైక్రో ఫిల్టర్ బెడ్‌లను 2016లో మార్చారు. 2021లో మార్చాల్సి ఉన్నప్పటికి వైసీపీ ప్రభుత్వం మార్చలేదు. దీనికి తోడు రైల్వే గేటు సమీపంలో అండర్ పాస్ పనుల గురించి పోతునూరు, కొవ్వలి, దెందులూరు, దోసపాడు మినహా మిగిలిన గ్రామాలకు పైలెట్ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా నిలుపుదల చేశారు. అండర్ పాస్ బ్రిడ్జి పనులు పూర్తయినప్పటికీ నీరు అందడం లేదు. మండలంలో చల్లచింతలపూడి జోగన్నపాలెం,పోతునూరు, దోసపాడు ఉండ్రాజవరం, వీరభద్రపురం, అక్కి రెడ్డి గూడెం, కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లు పాడై శిథిలస్థితికి చేరాయి. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

• సమస్య పరిష్కరిస్తాం



కొవ్వలిలోని పైలెట్ ప్రాజెక్టులో మైక్రోఫిల్టర్ బెడ్‌లు మార్చేందుకు ప్రతి పాదనలు పంపాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. మండలం లోని పది గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు పాడయ్యాయి. వాటిని అమృతధార పథకం ద్వారా త్వరలో నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

చింతమనేని వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, దెందులూరు

వీరవాసరాన్ని వీడని మంచినీటి సమస్య

వీరవాసరం, (భీమవరం టౌన్) : మేజర్ గ్రామపంచాయతీ.. మండల కేంద్రం.. అయినా వీరవాసరాన్ని తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. గ్రామ ప్రజల అవసరాలకు తగినట్లుగా స్వచ్ఛమైన తాగునీరు దొరకటం లేదు. తూర్పు చెరువు ఎల్లమ్మ చెరువు వద్ద నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓహెచ్ ఎస్ఆర్‌లు ఉండగా సుమారు ఏడు ఎకరాలు విస్తీర్ణంలో వీటికి అనుగుణంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఉంది. అయినప్పటికీ స్వచ్ఛనీటి కోసం వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తూ రక్షిత నీటి సరఫరా పథకాల ద్వారా వచ్చే నీటిని గృహ అవసరాలకే వినియోగిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ ద్వారా వీరవాసరం ఎస్టీ కాలనీ ప్రాంతంలోనూ, రెస్టహౌస్ చెరువు వద్ద, తీర్థాల పుంతలోనూ అదనపు ఓహెచ్‌ఎస్ఆర్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రెస్టహౌస్ చెరువు హైస్కూల్ సమీపంలో ఓహెచ్‌ఎస్ఆర్ నిర్మాణం ప్రారంభమైంది. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో నిలిచిపోయింది. ప్రస్తుతం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కుళాయి ఇచ్చే పనులు సాగుతున్నాయి.



వీరవాసరంలో ఇటీవల శుభ్రం చేసిన ఫిల్టర్ బెడ్



యువజనోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న గౌరవాధ్యక్షుడు డాక్టర్ బలరామ్, సభ్యులు

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి యువజనోత్సవాలు

ఆకివీడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పండుగ సమయాల్లో కోడిపందాలు,జూదాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్ అన్నారు. డీవైఎఫ్ఐ 42వ సంక్రాంతి యువజనోత్సవాలు ఈనెల 8 నుంచి 16 వరకు దాతల సహకారంతో చెడుగుడు, క్రికెట్, వాలీబాల్, చెస్, పాటలు, డ్యాన్స్, రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దుంపగడప కళాశాల, స్థానిక జిల్లాపరిషత్ బాలురు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాల్లో పోటీలు జరుగుతాయన్నారు.గురువారం బలరామ్ నర్సింగ్ హోమ్ వద్ద విలేకర్ల సమావేశంలో పోటీల వివరాలు తెలిపారు. జనవరి 8 నుంచి 11 వరకు ఉండి, భీమవరం, కైకలూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్, 13, 14న కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల వాలీబాల్, 13న జిల్లాస్థాయి పాటలు, మండల స్థాయి డ్యాన్స్ పోటీలు, రాష్ట్రస్థాయి చెడుగుడు 14,15,16 వరకూ, 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి చదరంగం పోటీలు, పట్టణస్థాయి రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ, ఆహ్వాన సంఘం కార్యదర్శి గేదెల ధనుష్, కోశాధికారి బొడ్డుపల్లి రాంబాబు, పెంకి అప్పారావు, గోపిశెట్టి రాంబాబు తదితరులు ఉన్నారు.



రామాలయంలో దీపోత్సవం వత్తులకు పూజలు

అయోధ్యకు 6 లక్షల దీపోత్సవ వత్తులు

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జరిగే కోటి దీపోత్సవానికి అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయం నుంచి 6 లక్షల దీపోత్సవ వత్తులను పంపారు. రామాలయంలో మహిళా భక్త బృందం సభ్యులు జైశ్రీ రామ్ నామాన్ని జపిస్తూ వత్తులు తయారు చేసి నువ్వుల నూనెతో తడిపి ప్యాకింగ్ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, రాజమహేంద్రవరం కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణ అప్పారావు, భక్తులు వత్తులను స్వామి వారి ముందు ఉంచి పూజలు చేసి అయోధ్యకు పంపారు. సీతా రాముల కల్యాణానికి శ్రీ కృష్ణ చైతన్య సంఘం వానర సేనతో సాగు చేసి పండించిన ధాన్యాన్ని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి గోటితో వలిచి తలంబ్రాలు తయారు చేయడం కోసం భక్తులకు అందజేశారు. ఈ విధంగా తయారు చేసిన స్వామివారి తలంబ్రాలను అయోధ్య, భద్రాచలం, చనుబండలలో జరిగే శ్రీసీతారామ కల్యాణంలో వినియోగిస్తామని అప్పారావు చెప్పారు.

శ్రీకూర్మనాథునిగా అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి



శ్రీ కూర్మనాధుడు

పాలకొల్లు అర్బన్, జనవరి, 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం 18వ రోజు గురువారం పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మంధర పర్వతాన్ని తనపై భారం మోపిన పెరుమాళ్‌ను, శ్రీకూర్మనాథుడి అవతారంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. టీటీడీ ప్రభంద ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేశారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, పవన్ కుమార్, వెంకట కృష్ణమాచార్యులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవలు నిర్వహించారు. ఉదయం రేపాక సుధారాణి వీణాగానంతో ప్రభాత సేవ చేశారు.



వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మండపంలో కొలువైన శ్రీవారు, అమ్మవార్లకు నిర్వహించిన ధనుర్మాస ఉత్సవం గురువారం ఉదయం రమణీయంగా జరిగింది. ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని శ్రీవారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. తమ ఇంటి ముంగిటనున్న మూర్తులను ఎంతో భక్తిప్రపత్తులతో దర్శించారు. తరువాత మండపంలో కొలువుతీరి భక్తులను కటాక్షించారు. అర్చకులు పూజలు జరిపి హారతులిచ్చారు. ప్రసాదాలను పంపిణీ చేశారు.

నరసాపురం-మచిలీపట్నం కొత్త రైల్వే లైన్‌కు డీపీఆర్ సిద్ధం

అన్ని నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్లు
నరసాపురం- వారణాసి మధ్య కొత్త రైలుకు ప్రతిపాదన
కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ


మంత్రికి బొకే అందిస్తున్న కొవ్వలి నాయుడు

నరసాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి):నరసాపురం-మచిలీపట్నం మధ్య చేపట్టే కొత్త రైల్వేలైన్ పనులకు డీపీఆర్ సిద్ధమైందని, రానున్న బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు విడుదలయ్యే ఛాన్స్ ఉందని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం నరసాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరసాపురం- కోటిపల్లి రైల్వేలైన్ జాప్యానికి నిధులు, భూసేకరణనే కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ళల్లో ఇవ్వాల్సిన వాటా మొత్తంలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఈ బడ్జెట్‌లో విడుదలయ్యే నిధులతో ఈ పనులు వేగవంతం అవుతాయన్నారు. నరసాపురం వారణాశిల మధ్య కొత్త రైలు, నరసాపురం-సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైలు ప్రతిపాదనలో ఉంద న్నారు. త్వరలో భీమవరం-చెన్నైల మధ్య వందేభారత్‌ను కూడా తీసుకొస్తామన్నారు. కూటమి రాకతో రాష్ట్రంలో పరిస్థితి మారిందని, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం నెలకొందన్నారు.

165ఎన్‌హెచ్‌కు ఐదు ఎలైన్‌మెంట్లు

పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి ఆకివీడు వరకు నిర్మించే 165 జాతీయ రహదారికి ఐదు ఎలైన్‌మెంట్లను ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదించారన్నారు. వీటితో పాటు రైల్వే క్రాసింగ్‌ల వద్ద నిర్మించే ఆర్వోబి వంతెన నిర్మాణాల ఖర్చు, తదితర ప్రతిపాదనలు పూర్తికాగానే ఈ పనులకు నిధులు విడుదల అవుతాయన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి రూ.10కోట్లు కేంద్రం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తామన్నారు. తణుకు, టీపీగూడెం కేంద్రాల్లో డయాలసిస్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని బరియల్ గ్రౌండ్‌లకు ఫెన్సింగ్ వాల్‌కు అవసరమైన నిధుల్ని మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు శ్రీనివాసవర్మను కొవ్వలి నాయుడు, పొత్తూరి ఘనంగా సత్కరించారు. నారిన తాతాజీ, మేకల సతీశ్, పీవీఆర్, బొమ్మిడి సునీల్, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రతాప్‌నాయుడుకి నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు తదితరులు

రైతు బిడ్డ ప్రతాప్ నాయుడుకు ఘన నివాళి

నరసాపురం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏ పదవి నిర్వహించినా... దానికి వన్నె తెచ్చి ప్రజల మనస్సుల్లో నిలిచిన గొప్ప వ్యక్తి బండారు ప్రతాప్ నాయుడు అని పలువురు కీర్తించారు. గురువారం సరిపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు తండ్రి ప్రతాప్ నాయుడు సంస్మరణ సభ జరిగింది. దీనికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, విప్ నాయకర్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ రాజ్య సభ సభ్యురాలు సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్‌రావు, శేషుబాబు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, చాగంటి చిన్న విచ్చే శారు. ప్రతాప్‌నాయుడు చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా, నీటి సంఘం అధ్యక్షులుగా సేవల ందించి రైతుబిడ్డగా మనస్సుల్లో నిలిచారన్నా రు. నేత్రదానం చేసి పది మందికి ఆదర్శ ంగా నిలిచారన్నారు. బండారు మాధవనాయుడు, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

పథకం ప్రకారం ఇరికిస్తున్నారు: ప్రభావతి


చికిత్స పొందుతున్న ప్రభావతి

నూజివీడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి):పథకం ప్రకారం తనపై కక్ష సాధిస్తూ కేసుల్లో ఇరికిస్తున్నారని, యూనియన్ బ్యాంకులో పని చేస్తూ సస్పెండ్ అయిన దావులూరి ప్రభావతి ఆరోపించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మాట్లాడుతూ తాను గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజరుగా పని చేస్తున్నప్పటి నుంచి సీతారాంపురానికి చెందిన వైసీపీ నాయకుడు కవులూరి యోగేంద్ర తనను టార్గెట్ చేసి అసత్య ఆరోపణలు చేస్తూ పథకం ప్రకారం కేసుల్లో ఇరికిస్తున్నాడన్నారు. ఇదే కోవలో జనసేన నాయకుడిగా చెప్పుకునే వెంకట్రావు బుధవారం తన ఇంటి సమీపానికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించడంతో తన తండ్రి, సోదరుడు ఆయనను పడదోశారన్నారు. ఆ సమయంలో పెనుగులాట జరగ్గా, అసభ్యంగా ప్రవర్తించడంతోనే వెంకట్రావుపై చేయి చేసుకున్నానన్నారు. ఆపై వెంకట్రావును పోలీసులకు అప్పగించింది తానేనన్నారు. అయితే ఈ ఘటన సైతం ఒక పథకం ప్రకారమే జరిగిందనేందుకు వీడియో తీయటమే ఉదాహరణ అన్నారు. వెంకట్రావు వ్యవహరించిన తీరు ఎలా ఉందనేది తన ఇంటి సీసీ ఫుటేజ్‌ల్లో ఉందని, నిజానిజాలు పరిశీలించి తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. తనపై నూజివీడు, ఇతర ప్రాంతాల్లో పెట్టిన కేసులన్నీ నిరాధారమైనవని, ఎవరో తనకు తెలియని వారితో తనపై కేసులు బనాయించటం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ అండ చూసుకుని యోగి తనపై అక్రమ కేసులు బనాయించగా, అవి ఇప్పటికి కొనసాగించటం శోచనీయమన్నారు.

ఇరుపక్షాలపై కేసులు

నూజివీడు మండలం మర్రిబందం గ్రామంలో జనసేన నాయకుడు వెంకట్రావు, బ్యాంకు ఉద్యోగిని దావులూరి ప్రభావతిల విషయంలో ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు తెలిపారు.

అర్హత సాధించిన 211 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు


ఏలూరులో కానిస్టేబుల్ అభ్యర్థుల పరుగు పందెం పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గత నెల 30వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న 204 పోస్టుల భర్తీకి రాష్ట్ర పోలీసుల రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులు అర్హత సాధించగా వీరిలో పురుష అభ్య ర్థులు 3997 మంది కాగా, మహిళా అభ్యర్థి నులు 979 మంది ఉన్నారు. గురువారం 600 మంది అభ్యర్థులకుగాను 346 మంది హాజరయ్యారు. వీరిలో 211 మంది అభ్యర్థు లు అర్హత సాధించారు.

మహిళా అభ్యర్థినులకు స్పోర్ట్స్ ఈవెంట్స్

పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ప్రిలిమనరీ పరీక్షల్లో అర్హత సాధించిన 979 మంది మహిళా అభ్యర్థినులకు ఈనెల 3, 4 తేదీలలో ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ ఈవెంట్స్‌ను నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా మహిళా అధికారులతో ఈ పోటీ పరీక్షలను నిర్వహించడానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల దారి మళ్లింపు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైందవ శంఖారావం మహాసభ ఈనెల 5వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో జరుగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్ళింపుకు పోలీసులు నిబంధనలు విధించారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్ళే వాహనాలు భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌వైపు వెళ్ళాలన్నారు. ఏలూరు బైపాస్, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, ఖమ్మం మీదుగా కూడా హైదరాబాద్ వెళ్ళవచ్చన్నారు.

ఆక్వాకు ఆధునిక పరిజ్ఞానం జోడించాలి

మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్


రైతులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ డోలా శంకర్

యలమంచిలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దేశానికి అత్యధికంగా విదేశీ మారకద్రవ్యం అందిస్తున్న ఆక్వారంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్ పేర్కొన్నారు. మండలంలోని కలగంపూడి గ్రామంలోని పొత్తూరి పద్మనాభరాజుకు చెందిన ఆక్వాచెరువులలో కౌంట్ 366 పేరున ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సెన్సార్ పరికరాలను మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ డోలా శంకర్ పరిశీలించారు. పరికరాల పనితీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్వాసాగులో రైతులు కౌంట్ 366 పేరున ఏర్పాటుచేసిన ఆధునిక సాంకేతిక సెన్సార్ పరికరాలను వినియోగిస్తే చెరువుల్లో నీటి నాణ్యత, పీహెచ్, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీవో) స్థాయిలను ఎప్పటికప్పుడు రైతుల సెల్‌ఫోన్లకు సమాచారం అందిస్తుందని వివరించారు. ఈ పరికరాల వినియోగంతో డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ స్థాయిలకు అనుగుణంగా ఆటోమేటిక్ పద్ధతిలో ఏరియేటర్లను ఆపరేట్ చేయవచ్చని తద్వారా 25శాతం వరకూ విద్యుత్ ఆదా అవుతుందన్నారు. చెరువుల్లో నీటి నాణ్యత స్థాయిలు నిర్దేశిత ప్రమాణాల్లో లేనప్పుడు రైతులకు ఎలర్ట్ మెసేజ్‌లను ఈ పరికరాలు అందిస్తాయన్నారు. ఆక్వా రైతాంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ కల్పించే అంశాన్ని పరిశీలిస్తుందని తెలిపారు. జిల్లాలో 16,300 ఆక్వారంగ విద్యుత్ కనెక్షన్లు ఉండగా 13,648 విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ రాయితీ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ లాల్ మహ్మద్, డి.ఎఫ్.వో ఆర్.వి.ఎస్.ప్రసాద్, భీమవరం ఏడీ ఎల్.ఎల్.ఎన్.రాజు, ఆక్వాజెనిక్స్ ప్రో సంస్థ సిఈవో సలాది గోపికృష్ణ, కొమ్ముల మురళీకృష్ణ, పొత్తూరి పద్మనాభరాజు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని దక్షిణమధ్య రైల్వే అధికారులు ఏలూరు మీదుగా ఆరు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. కాచిగూడ నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్ళే రైలు (07653) కాచిగూడలో గురువారం, శుక్రవారాల్లో బయలుదేరుతుంది. కాకినాడ టౌన్ నుంచి కాచిగూడ వెళ్ళే రైలు (07654) కాకినాడలో శనివారం, సోమవారం బయలుదేరుతుంది. ఈ రైళ్లు కాచిగూడ, మల్కాజ్‌గిరి, చెర్లపల్లి, నల్గొండ, మిర్యాల గూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్ల కోట, కాకినాడలలో ఆగనుంది. రైల్‌నెంబర్ 07023 హైద రాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు శుక్రవారం వెళ్తుంది. రైల్‌నెంబర్ 07024 కాకినాడ టౌన్ నుంచి హైదరాబాద్‌కు శనివారం కాకినాడలో బయలుదేరుతుంది. ఈరెండు రైళ్ళు హైదరాబాద్, సికింద్రాబాద్ జంక్షన్, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, కృష్ణాకెనాల్, విజయవాడ జంక్షన్, గుడివాడ జంక్షన్, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, అనపర్తి, సామర్ల కోట జంక్షన్, కాకినాడ టౌన్ స్టేషన్లలో ఆగనున్నాయి.

క్రైమ్ కార్నర్

గోవా బీచ్‌లో న్యూ ఇయర్ వేడుకలు

గూడెం యువకుడి హత్య


రవితేజ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గోవా బీచ్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుపు కునేందుకు స్నేహితులతో వెళ్లిన తాడేపల్లిగూడెంకు చెందిన యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుచూసింది. స్థాని కులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం 6వ వార్డుకు చెందిన బొల్లా రవితేజ (26) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే నూతన సంవత్సర వేడుకలను గోవాలో స్నేహితులతో జరుపుకునేందుకు గత శనివారం వెళ్ళాడు. ఆదివారం రాత్రి కలంగూట్ బీచ్‌లో స్నేహి తులతో సరదాగా గడిపి పక్కనే రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు వెళ్లారు. అక్కడ రెస్టారె ంట్ యజమాని కొడుకు సిల్వేరా, అతడి స్నేహితులు ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఘర్షణ తలెత్తింది. దీంతో హోటల్ సిబ్బంది అంతా కలిసి ఈ ఘర్షణ లో రవితేజ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఆ మృతదేహం స్వస్థలం చేరడానికి ఇబ్బంది లు తలెత్తడంతో స్థానిక ఎమ్మెల్యే చొరవతో ప్రత్యేక విమానంలో తాడేపల్లిగూడెంకు బుధవారం తీసుకువచ్చారు.

తల్లిదండ్రులు తిట్టారని విద్యార్థి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సరిగా చదవడంలేదని తల్లి దండ్రులు మందలించడంతో విద్యార్థి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని మంచినీళ్ళతోటకు చెందిన కటకం దుర్గా ప్రసాద్, దేవి దంప తులు వస్త్రాల దుకాణాల్లో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్గా ప్రమోద్‌కుమార్ మైలవరంలో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. చిన్న కుమారుడైన షణ్ముఖ ప్రవీణ్ (13) ఏలూరు అశోక్‌నగర్‌లో ఉన్న అమలోద్భవి స్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు. అతని సోదరుడు ప్రమోద్‌కుమార్ వెళ్ళిపోయినప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ సరిగా చదవలేకపోతు న్నాడు. దీంతో తల్లి దండ్రులు అతనిని మందలించారు. గతనెల 31వ తేదీన కూడా మందలించారు. ఈనెల 1వ తేదీ రాత్రి తల్లి దండ్రులు రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో ఒంటరిగా ఉన్న షణ్ముఖ ప్రవీణ్ ఉరి వేసు కుని వేలాడుతూ కనిపించాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేపలకు మేత వేస్తూ రైతు మృత్యువాత


కల్యాణ్

పెదపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చేపలకు మేత వేస్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందాడు. పెదపాడు ఎస్‌ఐ శారదా సతీశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలం రాజుపేట గ్రామానికి చెందిన గుండపనేని కల్యాణ్ గురువారం మధ్యాహ్నం చేపలకు మేతవేస్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. అక్కడకు సమీపంలో ఉన్నవారు గమనించి బయటకు తీసి, ఏలూరు ఆస్పత్రికి తరలించారు. అయితే కల్యాణ్(40) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

రెండున్నర లక్షల రూపాయల అసలైన నోట్లు
15 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం


నకిలీనోట్లు, చైన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అసలు నోట్లకు దొంగ నోట్లు అధిక మొత్తంలో ఇస్తామని మోసగిస్తున్న ఒక ముఠాను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ వి.సుధీర్ వారి సిబ్బంది కలిసి ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ద్వారకాతిరుమలలో ఒక వ్యక్తివద్ద నుంచి రెండున్నర లక్షల అసలు నోట్లను తీసుకుని 15 లక్షల దొంగ నోట్లను ఒక ముఠా మార్చుకుంటుందని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడూరి రవి తేజ (28) ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో ఉంటూ దొంగ నోట్ల మార్పిడి ముఠాను తయారు చేశాడు. జంగారెడ్డిగూడెం పద్మాథియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న షేక్ నాగూర్‌మీరావలి (25) జంగారెడ్డి గూడెం మసీదు సెంటర్‌కు చెందిన వీరంకి రాజేశ్ (28)లతో రవితేజ ముఠా ఏర్పాటు చేసుకున్నారు. నాగూర్‌మీరావలి, వీరంకి రాజేష్‌లు 15 లక్షల రూపాయల నకిలీ నోట్లను తీసుకుని గురువారం ద్వారకాతిరుమలలో రోడ్డుపక్కన హోటల్ నడుపుకుంటూ జీవించే కొల్లు సుబ్రహ్మణ్యం అలియాస్ సుభాష్ (40) వద్దకు వెళ్ళి డబ్బులు మార్పిడి చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి అసలైన నోట్లు రెండున్నర లక్షల రూపాయలు, నకిలీ నోట్లు (500రూపాయలు) 15 లక్షల రూపాయలు, ఒక మోటారు సైకిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కోడూరి రవితేజ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

కోళ్ల లోడు వ్యాన్ బోల్తా

400 కోళ్లు మృత్యువాత



ఆకివీడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కోళ్లలోడు వ్యాన్ తిరగబడింది. స్థానిక బజార్‌లోని కోళ్ల చికెన్ సెంటర్ దుకాణంలో గురువారం కోళ్లు దిగుమతి చేసి తాడేపల్లిగూడెం బయలు దేరింది. పెద్ద వంతెన సమీపంలోని పశువుల ఆసు పత్రి దగ్గర కోళ్లలోడ్ వ్యాన్ తిరగబడడంతో డ్రైవర్,క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వ్యాన్‌లో ఉన్న సుమారు 400 కోళ్లు మృత్యు వాతపడ్డాయి. సుమారు రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యావసర సరుకులు తెచ్చేందుకు వెళ్లి వృద్ధుడి మృతి



జీలుగుమిల్లి, జనవరి, 2: (ఆంధ్రజ్యోతి): దర్భగూడెంకు చెందిన పైడిమర్ల సోమిరెడ్డి (70) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సోమిరెడ్డి జంగారెడ్డిగూడేనికి నిత్యావసర సరుకులు కొనుగోలుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో లక్ష్మీపురం వద్ద ఉంచిన సైకిల్ తీసుకుని కిరాణ సరుకులు తెస్తుండగా దర్భగూడెం జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న బొగ్గులోడు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తల నుజ్జయి అక్కడికక్కడే సోమిరెడ్డి మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పి.నవీన్ కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించి, కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఉండి, జనవరి2(ఆంధ్రజ్యోతి): బొండాడ డ్రెయిన్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహానికి సంబంధించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. మృతదేహం గురించి చుట్టుపక్కల విచారించగా ఎటువంటి ఆచూకీ లభించలేదని తెలిపారు. గురువారం అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. మహిళకు 40నుంచి 45 సంవత్సరాలు వుంటాయని, పూర్తి వివరాలు తెలియవలసి వుందని తెలిపారు. పాములపర్రు పంచాయితీ పరిధిలోని కొండగూడెం నుంచి ఉండి మీదుగా ప్రవహించే బొండాడ డ్రెయిన్‌లో ఉండి పడవలరేవు వద్ద మహిళ మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. వీఆర్వో మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పాత గొడవలతో కత్తితో దాడి

పెంటపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : పాత గొడవల నేపథ్యంలో వ్యక్తిపై మరొక వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం అర్ధరాత్రి దర్శిపర్రు గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లూరుపల్లి గ్రామా నికి చెందిన జాలాది గంగరాజు, అదే గ్రామా నికి చెందిన నేకూరి శ్రీనులకు పాతగొడవలు ఉన్నాయి. బుధవారం రాత్రి దర్శిపర్రు గ్రామంలో జరగుతున్న జాతర కార్యక్రమానికి గంగరాజు వెళ్ళాడు. ఈ విషయం తెలుసు కున్న శ్రీను కూడా జాతరకు వెళ్ళి అర్ధరాత్రి దాటిన తరువాత ఎవరూ లేని సమయం చూసి గంగరాజుపై కత్తితో దాడి చేశాడు. దీంతో మెడపై తీవ్ర గాయం అయిన గంగరాజు ను స్నేహితులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నింది తున్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు.

మాజీ హోం గార్డు చైన్ స్నాచింగ్

ఏలూరు క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న మాజీ హోంగార్డును పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ గురువారం ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు బొమ్మిడి గ్రామంవైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఒక వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెను ఎక్కించుకుని దించుతానని చెప్పి కొద్ది దూరం వెళ్ళిన తరువాత ఆకస్మాత్తుగా మోటారు సైకిల్ ఆపి ఆమె మెడలో ఉన్న సూత్రాల తాడును తెంపుకుని పరారీ అయ్యాడు. ఈ సంఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. నిడమర్రు సీఐ ఎంవి సుభాష్ ఆధ్వర్యంలో నిడమర్రు ఎస్‌ఐ ఎస్ వీర ప్రసాద్, గణపవరం ఎస్‌ఐ మణికుమార్, సిబ్బంది కలిసి ఒక బృందంగా ఏర్పడ్డారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. దీంతో ఈనేరానికి పాల్పడిన వ్యక్తి రాజస్థాన్‌కు చెందిన మహేందర్‌సింగ్ (30)ను గుర్తించారు. మహేందర్‌సింగ్ గతంలో హైదరాబాద్‌లో ఉంటూ హోంగార్డుగా పనిచేసేవాడు. అతను నేరాలకు పాల్పడుతుండడంతో అతనిని శాశ్వతంగా హోంగార్డు ఉద్యోగం తీసివేశారు. అప్పటి నుంచి అనేక ప్రాంతాలు మారిపోతూ కొద్ది కాలం నివాసం ఉంటూ నేరాలకు పాల్పడుతున్నాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీలో ఉంటూ మోటారు సైకిల్‌పై వివిధ జిల్లాలు తిరుగుతూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. గురువారం తెల్లవారు జామున అతనిని అరెస్టు చేసి మూడున్నర కాసుల బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు.

ఫోన్ పోయింది..

అకౌంట్‌లో రూ.99 వేలు కొట్టేశారు..


బాధితుడు పాపిరెడ్డి

చాట్రాయి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కిరాణా షాపుకు వెళితే అక్కడ ఫోన్ పోయింది. కొద్ది సేపటిలోనే అకౌంట్‌లో ఉన్న రూ.99 వేలు కొట్టేసిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. ఈ సంఘటన డిసెంబరు 30వ తేదీన జరగ్గా వెంటనే బాధితుడు చాట్రాయి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం చాట్రాయిలో కెఎంఆర్ ఇరిగేషన్ షాపు యజమాని కుప్పిరెడ్డి పాపిరెడ్డి డిసెంబరు 30వ తేదీ ఉదయం కిరాణా షాపుకు సరుకుల కోసం వెళ్ళగా ఫోన్ పోయింది.

అదే రోజు పాపిరెడ్డి బ్యాంకు వెళ్ళి ఆరా తీయగా అకౌంట్‌లో రూ.99 వేలు ఒడిస్సాలోని రెండు అకౌంట్లకు ఫోన్‌పే ద్వారా బదిలీ అయినట్లు తెలుసుకొని అవాక్కయ్యాడు. ఫోన్ ఉదయం 8 గంటలకు పోతే, 8.37 నుంచి 9.35 మధ్యలో రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.7 వేలు, రూ.22 వేలు కేటుగాళ్ళు డబ్బు లాగేశారు. నారాయణ మోహంతీ, అబ్దుల్ మజీథ్ ఖాన్ అకౌంట్లకు డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. యూపీఐ పిన్ నెంబరు లేకుండా కేటుగాళ్ళు టెక్నాలజీని ఉపయోగించి డబ్బు ఎలా కొట్టేశారో తెలియటం లేదని బాధితుడు అంటున్నారు. పాపిరెడ్డి వెంట ఫాలో అయ్యి ఆయన ఆదమరుపుగా ఉన్నప్పుడు ఫోన్ దొంగిలించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని అన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

టి.నరసాపురం, జనవరి 2, (ఆంధ్రజ్యోతి) : చీరకు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన అల్లంచర్లరాజుపాలెంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన శీలం సీతారావమ్మ(61) డిసెంబరు 31 సాయంత్రం ఇంటి వద్ద మంట వేసి చలికాగుతుంది. ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. కేకలు వేయటంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో చింతలపూడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి జనవరి 1న మృతి చెందింది. ఎస్సై ఎం.జయబాబు మృతురాలి కుమార్తె యడ్లపల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో చోరీ

ఏలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఫ్లిప్‌కార్ట్ కార్యాలయ షట్టర్ తాళాలు తీసి లాకర్ పగులగొట్టి అందులో ఉన్న రూ.3,73,592 నగదును డిసెంబరు 31 రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఈ విషయమై కార్యాలయ మేనేజరు డి.వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.

ఆకివీడు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

5వ పేజీ తరువాయి

టీపీవో కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్న ట్టు కమిషనర్ సమాధానం ఇచ్చారు. ఇలా మాట మాట పెరిగింది. అక్కడ నుంచి హుటా హుటిన రాధాకృష్ణ బయటకు వెళ్లి పోయారు. తన ద్విచక్ర వాహనంలో ఉన్న పెట్రోల్ తీసుకుని ఒంటిపై వేసుకున్నారు. అక్కడున్న సిబ్బంది ఉలిక్కిపడ్డారు. కేకలు వేస్తూ రాధాకృష్ణను ఆపే ప్రయత్నం చేశారు. ఒంటిపై ఉన్న పెట్రోల్‌ను శుభ్రం చేశారు. నగర పంచాయతీ కార్యాలయం బయట కలకలం రేగడంతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్న కమిషనర్ బయటకు వచ్చారు. రాధాకృష్ణను సముదాయించే ప్రయత్నం చేశారు. సిబ్బంది నియామకం కోసం పైఅధికారుల దృష్టికి తీసుకువెళతామని భరోసా ఇచ్చారు. ఆ తర్వాత టీపీవో తన సీటులో కూర్చుని పనిచేసుకున్నారు. ఈ ఘటనపై కమిషనర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం : ఆరిమిల్లి


ప్రజల సమస్యలు విని కంభంపాటి రామ్మోహన్‌తో కలిసి అర్జీలు స్వీకరించిన ఆరిమిల్లి

తణుకు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం అయ్యాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో మాజీ ఎంపీ, పొలిట్ బ్యూరో సభ్యులు కంభంపాటి రామ్మోహన రావుతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బాధితుల వివరాలు తెలుసుకుని అధికారులు ద్వారా పరిష్కరించామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలుకు వెన్నుదన్నుగా ఉంటుందని భరోసా కల్పించామన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : పితాని


కవిటం గ్రామ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

పోడూరు/పాలకొల్లు రూరల్/నరసాపురం రూరల్/పెనుమంట్ర, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : భూ సమస్య లకు పరిష్కార వేదిక రెవెన్యూ సదస్సులు అని, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించు కోవాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కో రారు. పోడూరు మండలం కవిటం గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చే పాస్ పుస్తకాలపై ప్రభుత్వం రాజముద్ర వేసి భూ హక్కులను కల్పిస్తుందన్నారు. సదస్సులో తహసీల్దార్ ఎస్ ఎం.ఫాజిల్ రైతులు నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ చుట్టుగుళ్ల పూర్ణిమ, ఎంపీడీవో బి.మంగాకుమారి, ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్వో కుమార్ పాల్గొన్నారు. అనంతరం పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని నాగరాజు పేట నుంచి సాయి చిత్రాలయ వంతెనం వరకు రూ.15లక్షలతో చేపట్టనున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, నాయకులు దొడ్డ శ్రీనివాసు, అందే కోటివీర భద్రం తదితరులు పాల్గొన్నారు. నరసాపురం మండలం సీతారాం పురం సౌత్ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డీటీ ప్రసాద్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

సచివాలయ భవనం ప్రారంభం

పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెంలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే పితాని ప్రారంభించి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంను నిర్మించి జాతికి అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

వాకపల్లిలో డ్రెయిన్ పూడికతీత పనులు


వాకపల్లిలో డ్రైన్ మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వాకపల్లి గ్రామంలో గత కొంత కాలంగా మురుగుపారుదల సౌకర్యం లేక ప్రజలు తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. వాకపల్లిలో డ్రెన్‌పూడిక తీత పనుల ప్రారంభానికి గురువారం శంకుస్థాపన చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఇటువంటి సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. జనసేన నాయకులు నండూరి సురేష్, టీడీపీ నాయకులు నండూరి పెదకాపు, నండూరి గాంధీ, తానేటి సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు : కారుమూరి

తణుకు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తేతలిలో ఏర్పాటు చేసిన పశు వధ ఫ్యాక్టరీని మూసివేసే వరకు ఎంతమందిపై కేసులు పెట్టినా వెనుకడుగు వేసే ప్రసక్తేలేదని మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు తెలిపారు. గురువారం తణుకు వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యావరణానికి, ప్రజలు నివసించేందుకు ఇబ్బందిగా వున్న ఫ్యాక్టరీని మూసేయాలని కోరుతూ చేపట్టిన గో-సంరక్షణ నాయకుడు కొండ్రెడ్డి శ్రీనివాస్‌పై బైండోవర్ కేసులు పెట్టడం దారుణమన్నారు. అన్ని పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామని చెప్పారు. గో-సంరక్షణ సమితి నాయకుడు కొండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకుండా నిరసన దీక్షలు చేస్తున్న వారిపై బైండోవర్ కేసులు పెట్టడం తగదన్నారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇందుగపల్లి బలరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


తెలుగు తల్లి విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న కమిటీ సభ్యులు

తెలుగు భాషకు ప్రాధాన్యమివ్వడం శుభపరిణామం

భీమవరంటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం తెలుగు భాషకు పెద్దపీట వేసి ప్రాథమిక విద్య నుంచి తెలుగు భాషను ప్రవేశ పెట్టడం శుభపరిణామమని తెలుగు భాషాభివృద్ధి కమిటీ సభ్యులు కలిగొట్ల గోపాల శర్మ, అరసవల్లి సుబ్రమణ్యం, చెరుకువాడ రంగసాయి, రామాయణం చిన్నారి అన్నారు. గురువారం బీవీ రాజు పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు భాషాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి హర్షం ప్రకటించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ విషయంలో ప్రతిపాదన చేసి తీర్మానం చేయడానికి సన్నాహాలు చేయడం అనందదాయకమన్నారు. బీవీ రాజు వాకర్స్ అసోసియేషన్ నాయకులు మోషేస్, చరణ్, గనిరెడ్డి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి పీహెచ్‌సీని సందర్శించిన డీపీఎంవో

అత్తిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కార్యక్రమాల నిర్వాహణాధికారి డాక్టర్ ధనలక్ష్మి గురువారం సందర్శించారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న క్యాన్సర్ సర్వేపై వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్ర రికార్డులను తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజు, జేఎస్ గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

» ఆరు బాటిళ్లు స్వాధీనం

ఇరగవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇరగవరం మండలం కేతవపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముర్ల చిన్న (54) అనే వ్యక్తిని అరెస్టు చేశామని తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్ మణికంఠరెడ్డి తెలిపారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఆర్ మధుబాబు, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


వృద్ధుడి గల్లంతు.. కేసు నమోదు

పెంటపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : కాల్వలో గేదెలను కడిగేందుకు వెళ్లి ప్రమాదవ శాత్తు కాల్వలో జారిపడి వృద్ధుడు గల్లంతయిన ఘటన బుధవారం ప్రత్తిపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఆకుల చినఆదినారాయణ గేదెలను కడిగేందుకు సమీపంలోని ఏలూరు కాల్వ వద్దకు తీసుకువెళ్ళి గేదెలను కడుగుతుండంగా ప్రమాదవశాత్తు కాల్వలో పడి గల్లంతయ్యాడు. ప్రస్తుతం బాధితుడి ఆచూకీ తెలియరాలేదు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.

భయం.. భయం..

» భవనంపై మొలిచిన మొక్కలు
» భయాందోళనలో స్థానికులు
» పట్టించుకోని అధికారులు

శిధిలావస్థలో పెంటపాడు పాత పంచాయతీ భవనం


శిథిలావస్థకు చేరిన పెంటపాడు పాత పంచాయతీ భవనం

పెంటపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు బజార్ రోడ్డు సమీపంలో ఉన్న పాత పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 2014లో టీడీపీ హయాంలో భవనం ప్రమాదకరంగా మారడంతో సమీపంలోని నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించి పాత భవనాన్ని ఖాళీ చేశారు. సిబ్బంది మొత్తం అక్కడకు తరలి వెళ్లారు. అక్కడితో అయిపోయిందని అధికారులు చేతులు దులిపేసుకున్నారు. పాతభవనానికి సంబందించి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేయడంతో భవనాన్ని అనుకుని పక్కనే రెండు ప్రభుత్వ పాఠశాలలు, సమీపంలోనే బాల వేంకటేశ్వరస్వామి ఆలయం, సరస్వతీ ఆలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, రామాలయాలు ఉన్నాయి. ఈ భవనం వద్ద జనసంచారం ఎక్కువగా ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయం.. భయంగా గడుపుతున్నారు. భవనం గోడలపైనా మొక్కలు మొలిచి ప్రమాదానికి సంకేతాలుగా మారాయి. ఈ భవనం పక్కనే అనేకమంది వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ధనుర్మాసం ప్రారంభం కావడంతో సమీపంలో ఉన్న బాలవేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది భక్తులు వస్తున్నారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించరా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పెనుగొండలో ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు


ఉండి జడ్పీ పాఠశాలలో ప్రదర్శన వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో జ్యోతి


నరసాపురంలో టీచర్ లలిత సుప్రియకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎంఈవో పుష్పరాజ్యం

బాల శాస్త్రవేత్తలు

» ఉత్సాహంగా మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

జిల్లావ్యాప్తంగా మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారం నిర్వహించారు. విద్యార్థులు బాలశాస్త్రవేత్తలుగా తమ ప్రదర్శనల రూపకల్పనలతో ఆకట్టుకున్నారు. ఆయా మండలాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

నరసాపురం టౌన్/మొగల్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణంలోని వైఎన్ కాలేజీలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో పుష్పరాజ్యం ప్రారంభించారు. మండల, అర్బన్‌లకు చెందిన హైస్కూల్ విద్యార్థులు 68 ప్రదర్శనలు చేశారు. 500 మంది విద్యార్థులు, వందమంది టీచర్లు పాల్గొన్నారు. టీచర్ కేటగిరిలో 'ఆటోమెటిక్ ఫైర్ డెస్ట్రాయర్ ఫర్ గొడౌన్స్' అనే అంశంపై ప్రదర్శించిన కేజీహెచ్ ఉపాధ్యాయురాలు లలిత సుప్రియకు సర్టిఫికెట్, షీల్డ్‌లు ఎంఈవో ప్రదానం చేశారు. మొగల్తూరు మండల మొగల్తూరు పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ పడవల మేరీ సత్యానారాయణ ప్రారంభించగా, కార్యక్రమానికి చైర్మన్‌గా ఎంఈవో శామ్యూల్ జాన్, హెచ్ఎం వి.రవిశంకర్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఉప సర్పంచ్ బోణం నాగలక్ష్మీనర్సింహారావు, వార్డు సభ్యురాలు హాజరయ్యారు. విశ్రాంత హెచ్ఎం గోపరాజు రాజేశ్వరరావు, మల్లాది ఆంజనేయులు ఈ ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకు బహుమతులు అందించారు.

• పాలకొల్లు అర్బన్ :స్థానిక ఎంఎంకేఎస్ఎం హైస్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్‌జీవీఎస్ గంగాధరశర్మ, ఎగ్జిబిషన్ కన్వీనర్, గరల్స్ హైస్కూల్ హెచ్ఎం వై.ప్రభాకర శాస్త్రి ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు కన్వీనర్ ప్రభాకర శాస్త్రి, ఎంఈవో శర్మ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ బహుమతులు అందించారు. విజేతలు ఇలా.. ఇంజనీరింగ్ విభాగంలో కె.యశ్వంత్, బయాలజీ విభాగంలో వీవీఏ సాయి, ఇన్విరాల్ మెంటల్ విభాగంలో కె.పవన్‌సాయి, ఎ దీపిక, ఎర్త్, స్పేస్, సైన్స్ విభాగంలో ఎస్.మోక్షిత, టి.హరిణి, డి.మౌనిక. టీచర్స్ ఎగ్జిబిషన్‌లో జేఎస్ఎన్‌మూర్తి, ఎస్‌చిక్కాల విజేతలుగా నిలిచారు.

• ఉండి/కాళ్ల : ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఎనిమిది హైస్కూల్స్‌తో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు ఎం.జ్యోతి, వినాయకుడు మాట్లాడుతూ ఆయా స్కూల్స్ విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలను పరిశీలించి అభినందించారు. ఉండి జడ్పీ ఉన్నతపాఠశాల ఇంజనీరు విభాగం, ఎన్ఆర్‌పీ అగ్రహారం హైస్కూల్ స్వతంత్ర విభాగం, మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ విభాగాలను ఎంపిక చేసి వారిని అభినందించారు. హెచ్ఎంలు వై.రామలక్ష్మి, అక్కురు చక్రవర్తి, జాన్‌బాబు, దిన్‌కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కాళ్ల మండలంలోని కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఎ.రవీంద సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

• పెనుగొండ : ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ అన్నారు. పెనుగొండలోని ఎస్‌వీకేపీ అండ్ వీపీ జూనియర్ కళాశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ, ఎంఈవోలు శుభాకరరావు, రామకృష్ణ ప్రారంభించారు. ప్రదర్శనలో ఏడు ప్రభుత్వ పాఠశాలల నుంచి మూడు కేటగిరీలలో మొత్తం కలిపి 19 ప్రదర్శనలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్‌వీకేపీ కళాశాల అధ్యాపకులు పి.శ్రీనివాసు, గణేష్ గుప్తా, కె.రూతు వ్యవహరించారు.


కేటాయించిన చాంబర్‌లో శ్రీనివాస్

శాసన సభలో విప్ బొలిశెట్టికి చాంబర్ కేటాయింపు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు శాసన సభలో 115వ చాంబర్ కేటాయించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, రూరల్ టీడీపీ అధ్యక్షుడు పరిమి రవికుమార్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు గంధం సతీష్ అమరావతిలో బొలిశెట్టిని కలిసి అభినందనలు తెలిపారు.



ఆలమూరులో ర్యాలీ దృశ్యం

భూ రీ-సర్వే పైలట్ ప్రాజెక్టుగా ఆలమూరు

పెనుమంట్ర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా ఆలమూరు గ్రామాన్ని ఎంపిక చేశామని తహసీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. గురువారం ఆలమూరులో రీసర్వే ప్రాజెక్టులో భాగంగా పైలట్ గ్రామంగా ఎంపికైన ఆలమూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు.. ర్యాలీలో మాజీ ఉపసర్పంచి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కడలి ఏడుకొండలు, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు తేతలి వెంకట రామారెడ్డి, గ్రామ ఉప సర్పంచి కొవ్వూరి సుబ్బిరెడ్డి, పంచాయతీ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వడలి గ్రామంలో అక్షయపాత్ర సభ్యులు నిరుపేదలకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పెనుగొండకు చెందిన నారికడమిల్లి సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను అక్షయ పాత్ర సభ్యులు సేకరించి పంపిణీ చేసినట్టు తెలిపారు. ఉప్పలపాటి చంటి, అంగర బాలకృష్ణ, మేకా సురేష్, ఉప్పలపాటి బాస్కరరావు పాలల్గొన్నారు.

జాతీయ బీసీ సంఘ పట్టణ అధ్యక్షుడిగా సత్యనారాయణ


ముక్కా సత్యనారాయణకు నియామక పత్రం అందిస్తున్న గణేష్ భవానీ

పాలకొల్లు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం పాలకొల్లు పట్టణ అధ్యక్షుడిగా ముక్కా సత్యనారాయణ నియమితులయ్యారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ భవానీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాలి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. 50శాతం రిజర్వేషన్లు బీసీ వర్గాలకు అమలు చేయాలంటే జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు కేంద్రమంత్రి వర్గంలో చోటుకల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు వింజరపు శంకరం, కొరుకొండ సుబ్బారావు, తమిరి వెంకటేశ్వరరావు, ఎన్.సత్యప్రసాద్, మామిడిశెట్టి పెద్దిరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడిగా సత్యానారాయణకు నియామకపత్రం అందించారు.


రజక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్ పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

రజక కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం

భీమవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన ఉప్పులూరి చంద్రశేఖర్ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం విజయవాడలోని బీసీ భవన్‌లో రజక ఎమ్మెల్సీ డి.రామారావు, గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గల్లా మాధవి, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి, అగ్నికుల క్షత్రియ ఛైర్మన్ పాపారావు ముఖ్యఅతిథులుగా, కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.సావిత్రి అధ్యక్షతన ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీలో సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అనేక పదవీ బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, మంత్రివర్యులు నారా లోకేశ్, బీసీ మంత్రివర్యులు సవిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తదితర కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు చింతాడ శ్రీనివాస్, చించినాడ శ్రీనివాస్, పోడూరి వెంకటరమణ, జామి రమేష్, కోరిపల్లి శ్రీనివాస్, చోడిశెట్టి నారాయణస్వామి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, చిటికెల శ్రీనివాస్, రజక సంఘ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌డీ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తణుకు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ ఫలితాలను కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్యఉషారాణి గురువారం విడుదల చేశారు. ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ 74 శాతం, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ 70శాతం, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ 86 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను కోశాధికారి నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరిబాయ్ అభినందించారు.

• ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలు

పాలకొల్లు అర్బన్ : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ పరీక్షల్లో మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో 219 మంది విద్యార్థులు హాజరు కాగా, 166 మంది (75.80శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈకార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ, ఎగ్జామ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

8 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి



డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ
తహసీల్దార్, తణుకు

• **ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు ఎన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి ?**

జవాబు: తణుకు మండలంలో మొత్తం 9 గ్రామాలు ఉండగా.. ఎనిమిది గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి.

• **మండలంలో ఇప్పటి వరకు రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని అర్జీలు అందాయి ?**

జవాబు: గ్రామ సదస్సుల్లో ఇప్పటి వరకూ 141 దరఖాస్తులు అందాయి.

• **మండలంలో ఎన్ని గ్రామాల్లో భూ సర్వే నిర్వహించారు ?**

జవాబు: మండలంలో తేతలి, కోనాల, ముద్దాపురం గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో సమగ్ర భూ సర్వే చేపట్టి పూర్తి చేశారు.

• **భూ సర్వేపై ఫిర్యాదులు వస్తున్నాయా ?**

జవాబు: భూ సర్వే పూర్తి చేసిన గ్రామాల నుంచి భూ విస్తీర్ణంలో తక్కువ వచ్చిందని, సర్వే నంబర్లలో సబ్ డివిజన్‌లు మారినట్లు, మ్యూటేషన్ పిర్యాదులు ఎక్కువ వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-తణుకు రూరల్)

పేదలకు 'ధర్మారావు ఫౌండేషన్' భోజనాలు

పాలకొల్లు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ గురువారానికి 1,472వ రోజుకు చేరింది. గురువారం తూర్పు గోదావరి జిల్లా లక్కవరానికి చెందిన టీడీపీ నేత ముదునూరి గోపాలకృష్ణంరాజు పుట్టిన రోజు సందర్భంగా పేదలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనాల్లో కోడిగుడ్డు, స్వీటు, పలు రకాల వంటకాలతో ఏర్పాటు చేయడం పట్ల పలువురు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా దాత గోపాలకృష్ణంరాజును ధర్మారావు ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు మేడిశెట్టి కేశవరావు, పాలవలస తులసీ రావు తదితరులు సత్కరించారు.

సూర్యచంద్రరావుకు ఘన నివాళి

నరసాపురం టౌన్, జనవరి2(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దల పాటు డీలర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడు పెరమళ్ళ సూర్యచంద్రరావు అని ఆర్డీవో దాసిరాజు అన్నారు. గురువారం శివాలయం రోడ్‌లో నిర్వహించిన సంస్మరణ సభకు ఆయన అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లా నుంచి రాష్ట్ర నాయకుడిగా వెళ్లిన అయన అక్కడ కూడా డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర నాయకులు దివి లీలామాధవరావు, వాసురెడ్డి నర్సింహారావు, అధికారి ఏసు, నెక్కంటి సుబ్బారావు, అత్మూరి వెంకట నరసయ్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు రూరల్/ఆకివీడు/మొగల్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తణుకు మండలంలోని పలు గ్రామాల్లోని రేషన్ షాపులతో పాటు తణుకు పట్టణంలోని పలు రేషన్ షాపులకు డీలర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తణుకు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, 19న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహిస్తారని, 22న పరీక్ష ఫలితాలను వెల్లడిస్తారన్నారు. 24న మౌఖిక పరీక్షలు నిర్వహించి, అదే రోజున తుది ఫలితాలను వెల్లడిస్తారన్నారు. ఆకివీడులో తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని రాజులపేటలో 10వ దుకాణానికి బీసీ-డీ(డబ్ల్యూ), ఆకివీడులో 22వ దుకాణానికి ఎస్సీ(డబ్ల్యూ), 26వ దుకాణానికి ఓసీ, చినమిల్లిపాడులోని 32వ దుకాణానికి ఓసీ(ఈడబ్ల్యూఎస్)లకు సంబంధించి అర్హులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మొగల్తూరు మండల డిప్యూటీ తహసీల్దార్ సుగుణ సంధ్య మాట్లాడుతూ కేపీపాలెం నార్త్‌లోని రేషన్ దుకాణానికి జనరల్ మహిళా కేటగిరికి కేటాయించినట్టు తెలిపారు.

న్యాయ సేవా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం

భీమవరం క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పారా లీగల్ వలంటీర్లు మండల న్యాయ సేవా సంస్థకు సామాన్య ప్రజలకు మధ్య వారధి లాంటి వారని, వలంటీర్లు చట్టాలపై అవగాహన పెంచుకుని న్యాయ సహాయం అవసరమైనవారికి సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందజేయాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ సూచించారు. గురువారం భీమవరంలో పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారి వారి ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేయడంలో సహకరించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించుటకు ప్రయత్నం చేయాలన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సంవత్సరం కాలపరిమితితో ఇచ్చే ఐడెంటిటీ కార్డులను సక్రమంగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు పలు చట్టాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాదులు బి. సురేష్ కుమార్, బి.సునీల్ పాల్గొన్నారు.